

సూఫీ కవిత్వం - కొన్ని అనువాదాలు

visit

http://sahitheeyanam.blogspot.com/

సూఫీ కవిత్వం

ఇస్లాం మతంలో ఒక ఆధ్యాత్మిక అధ్యాయం సూఫీతత్వం . ఈ తత్వం ప్రకారం స్వీయ ఆధ్యాత్మికా మార్గాన ఈశ్వర ప్రేమను పొందటం ధ్యేయం . ఐహిక బంధాల నుంచి విముక్తమై మనసును దేవుని వైపు ప్రయాణింపచేయటం సూఫీల జీవన విధానంగా ఉంటుంది.

సూఫీలు ఆడంబరాలకు దూరంగా ముతక దుస్తులు ధరించి స్వా ములుగా జీవితాన్ని గడిపేవారు. సూఫీకవులు సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని , దైవచింతనను ప్రతిబింబిస్తూ అనేక రచనలు చేసారు . రూమీ, అత్తర్, హాఫీజ్, జామీ, సనాయ్, సాదీ, రబియా మొదలగువారు ప్రముఖులు.

వారు వ్రాసిన కవితలలో నాకు నచ్చిన కొన్నింటి అనువాదాలు ఇవి.

బొల్లోజు బాబా

ఫరిదుద్దీన్ అత్తర్ (అబు హమీద్ బిన్ అబుబక్ర్ ఇబ్రహీం) 1120-1229

1229 లో పెర్షియాను చెంఘీస్ ఖాన్ ఆక్రమించుకొన్నపుడు , ఓ వృద్ధుని యుద్ధఖైదీగా రాజుగారి వద్దకు తీసుకొచ్చారు . ఆ వృద్ధుని పట్ల జాలిపడ్డ ఒక పౌరుడు ఆతనిని ఒదిలివేయండి, అందుకు ప్రతిఫలంగా నేను వెయ్యి వెండినాణాలు ఇస్తాను అన్నాడట. అపుడా వృద్ధుడు " నన్ను అంత తక్కువకు అమ్మకండి , నా నిజమైన విలువను కట్టేవారు రావొచ్చు " అన్నాడట. మరొక వ్యక్తి ఒక మోపుడు ఎండు గడ్డి ఇస్తాను ఆ వృద్ధుడిని వదిలివేయండి అన్నాడు . అపుడా వృద్ధుడు " నా విలువ ఇదే ప్రభూ నన్ను ఇప్పుడు అమ్మివేయవచ్చు " అని చెప్పగా తాను మోసపోయినట్లు భావించిన రాజుగారు ఆ వృద్ధుని శిరచ్ఛేదనం గావించమని ఆదేశించాడట.

అలా శిరచ్ఛేదనం గావించబడ్డ వృద్ధుడే ప్రముఖ సూఫీ కవి ఫరిదుద్దీన్ అత్తర్.

ఈ ఉదంతం జరిగిందో లేదో చారిత్రిక ఆధారాలైతే లేవు కానీ అత్తర్ కవిత్వం దానికి సాక్ష్యంగా నిలుస్తుంది . అత్తర్ కవిత్వంలో ప్రాపంచిక సంపదల పట్ల తృణీకారము కనపడుతుంది. అధికారము, కీర్తి, భోగలాలస భక్తిమార్గానికి మనిషిని దూరంచేస్తాయని చెపుతుంది.

భూమిపై ఉండే సంపదల అశాశ్వత గురించి , ఒక చోట అత్తర్

" ఈ ప్రపంచైశ్వర్యం అంతా నీదైనప్పటికీ
అది రెప్పపాటులో నీనుంచి అదృశ్యం కాగలదు" అంటాడు

ఈ దేహంలో బంధింపబడ్డ ఆత్మ ను ప్రక్షాళనం చేసుకోవటం ద్వారానే దైవసాయుజ్యం పొందగలమన్న సూఫీ తత్వాన్ని అత్తర్ తన గీతాలద్వారా ప్రవచించాడు. అత్తర్ రచనల్లో కాన్ఫరెన్స్ ఆఫ్ బర్డ్స్ ఒక గొప్ప సృష్టి.

1.

నడిరేయిలో ఓ సూఫీ ఇలా విలపిస్తున్నాడు.
ఈ ప్రపంచం మూత వేసిన ఓ శవపేటిక
దానిలోనే మనమందరమూ ఉన్నాం.
అజ్ఞానం కొద్దీ మన జీవితాలను
అవివేకంతో అధ్వాన్నంగా గడిపేస్తున్నాం.

మృత్యువు ఈ పేటిక మూత తెరువంగానే
రెక్కలు ధరించిన వారు అనంతంలోకి
ఎగిరిపోతారు.
లేని వారు పేటికలోనే మిగిలిపోతారు.

కనుక మిత్రులారా!
ఈశ్వరుని చేరే త్రోవలో పక్షిగా మారటానికై
అవసరమైనవన్నీ చేయండి.
రెక్కలు , తూలికలు పొందటానికి
ఏంచేయాలో అన్నీ చేయండి.

అత్తర్ --- "పెర్ఫ్యూం ఆఫ్ ద డిసర్ట్ " నుండి

2.
హృదయం చొక్కా పట్టుకొని
ఈ ప్రపంచపు తలను కాలితో తంతాను.
భూమిని, ఆకాశాన్ని నా గుర్రం కాళ్లక్రింద పడేసి తొక్కిస్తాను.
అందరినీ మించి బిగ్గరగా అరుస్తాను.
మరుక్షణం నేను ఈశ్వరుని ఎదుట
ఒంటరిగా మౌనంగా నిలుచుని ఉంటాను.

-- అత్తర్

3.

హతీమ్ అల్ అసామ్
"నేను నాలుగువిషయాలు ఎంచుకొని
మిగిలిన జ్ఞానాన్నంతా వదిలేసాను" అన్నాడు.

మొదటిది: నా దినసరి తిండి నిర్ణయింపబడ్డది.
అది పెంచబడదు, తగ్గించబడదు.
కనుక నేను దానిని పెంపుచేసే
ప్రయత్నాలు విరమించుకొన్నాను.

రెండవది: ఈశ్వరునికి నే పడ్డ బాకీ
మరెవరూ తీర్చరని తెలుసుకొన్నాను.
కనుక దానిని తీర్చటంలో నిమగ్నమయ్యాను.

మూడవది: నేనెప్పటికీ తప్పించుకోలేని,
ఒకరు తరుముతున్నారు , అదే మృత్యువు.
అందుకే తనను కలసుకోవటానికి
సిద్ధపడుతున్నాను.

నాల్గవది: నాకు తెలుసు ఈశ్వరుడు
నన్ను పరిశీలిస్తున్నాడని.
అందుకే నేను చేయకూడని పనులు
చేయటానికి సిగ్గు పడతాను.

అత్తర్ --- "పెర్ఫ్యూం ఆఫ్ ద డిసర్ట్ " నుండి

4.
నీ మొఖము
అనంతమూ కాదు తాత్కాలికమూ కాదు.
నీ మొఖాన్ని నీవేనాడూ చూడలేవు,
నీవు చూసేది దాని ప్రతిబింబాన్ని మాత్రమే.

దర్పణం ముందు నిట్టూరుస్తూ
నీ ఊపిరి గాలులతో దాని ఉపరితలాన్ని
మసకబారేలా చేస్తున్నావు.
శ్వాసను నిదానముగా ఉంచు.
బంధించు, సాగర గజఈతగాని వలె.

కదిలావా, దర్పణ ప్రతిబింబం చెదిరిపోతుంది.

చనిపోకు, నిదురపోకు, మేల్కొనీ ఉండకు
ఏమీ చేయకు.

ప్రేమికులు ఒకరికొరకు మరొకరు ఓడినట్లుగా
నిన్ను నీవు పోగొట్టుకో,
అదే నీవు.
అదే నీకు కావలసినది.
దానికోసమే నీవు అన్వేషిస్తున్నావు.
-- అత్తర్

5.
అహాన్ని చంపుకోనంత కాలమూ
ఇతరులతో పోల్చుకొంటూ ఉన్నంత కాలమూ
మనం స్వేచ్ఛ నొందలేము.

బాహ్య ప్రపంచాన్ని తొడుక్కొన్నవారు
భక్తి మార్గంలో నడవలేరు.
-- అత్తర్

6.

నీ నుంచి జీవితాన్ని లాగేసుకొనే లోపే
ఈ మర్మాన్ని ఛేదించటానికి శ్రమించు.

నీవేమిటో బతికుండగా తెలుసుకోలేకపోతే
నీ ఉనికి రహస్యాన్ని ఎలా
అర్ధం చేసుకోగలవూ? చచ్చాకా!

----అత్తర్

జలాలుద్దీన్ మహమ్మద్ రూమి (1207-1273)

రూమి పదమూడవ శతాబ్ధానికి చెందిన పర్షియన్ కవి . దేవుని చేరటానికి కవిత్వం, సంగీతం, నృత్యం ప్రధాన సాధనాలని రూమీ భావించాడు . ఈతని కవిత్వం ఏమతానికి చెందక మానవత్వాన్ని ప్రతిబింబించటం ఒక ప్రత్యేకత . జీవితాన్ని అక్షరాలుగా మలచి అందించాడు రూమి . ఆయనకవితలలో మార్మికత, భావుకత, మానవత్వంపై అచంచల విశ్వాసం , దేవుని పై ఆరాధనా కనిపిస్తాయి . ఈ నాటికీ ప్రపంచవ్యాప్తంగా రూమీ కవిత్వానికి ఆదరణ ఉన్నదంటే దానికి కారణం ఆయన కవిత్వంలో పరచుకొన్న మానవజీవన చిత్రణే.

రూమీ గురించి మరిన్ని వివరాలు ఈ లింకులో చూడవచ్చును .
http://te.wikipedia.org/wiki/జలాలుద్దీన్_ముహమ్మద్_రూమి
రూమీ పూర్తి రచనలను శ్రీ దీవి సుబ్బారావు అనువదించారట.

1.
వెలిగించటానికి సిద్ధంచేసిన
ఓ దీపముంది నీ హృదయంలో.
నింపేందుకు సిద్ధంగా
శూన్యముంది నీ ఆత్మలో
నీకూ తెలుస్తూంది కదూ!

ఈశ్వరునితో నీ వియోగం
నీకు అర్ధమౌతూంది కదూ!
నిను నింపటానికి అతనిని ఆహ్వానించు.
అగ్నిని కౌగిలించుకో.

ప్రేమ తనంత తానే వస్తుందనీ
దానికై నీ తపన పాఠశాలల్లో నేర్పరనీ
గుర్తుచేసుకో.

రూమి - పాషనేట్ పోయమ్స్ ఆఫ్ రూమి" నుండి

2.
ఉదయపు గాలులు వీస్తున్నాయి.
ఉదయపు గాలులు తమ తాజా
వాసనలను పంచుతున్నాయి.
నిదుర లేచి వాటిని ఆహ్వానించు.
మనలను బ్రతికించే గాలులవి.
అవి వెళ్లిపోయే లోగా పిల్చుకో.

రూమీ - "ది ఎస్సెన్షియల్ రూమి" నుండి.

3.
నదిని ఆలకించు
ఈ ఒడ్డుపై మరణించి
సముద్రాన్ని చేరే
నదుల మార్గాన్ని
అనుసరించమని
చెపుతూంది అది

రూమీ - " సే ఐ ఆమ్ యూ" నుండి

4.
నీకు ఏదైనా కానుక నీయాలని
నేనెంత అన్వేషించానో నీకు తెలియదు.
సరైనదేదీ దొరకలేదు.
బంగారు గనికి బంగారాన్నీ,
జలనిధికి నీటినీ కాన్కలుగా ఈయటం
ఏం బాగుంటుంది.
అన్నీ అలానే అన్పించాయి.
నా హృదయాన్నో, ఆత్మనో ఇవ్వాలనుకోవటం
ఉచితం కాదు, ఎందుకంటే
అవి ఇప్పటికే నీకు సమర్పించేసాను.

అందుకే, ఒక దర్పణాన్ని తీసుకొచ్చాను.
దానిలో నిన్ను చూసుకొని
నన్ను గుర్తుచేసుకో.

రూమీ - "ది ఎస్సెన్సియల్ రూమి" నుండి.

5.
ఆశే ఈ రహస్యానికి కేంద్రబిందువు
ఆశే స్వస్థత నిస్తుంది కూడా చిత్రంగా.

నియమేమిటంటే
బాధ అనుభవించాలి.
నీ కోర్కె క్రమశిక్షణొందాలి.
భవిష్యత్తులో ఏమి జరగాలనుకొంటావో
దానిని త్యాగం చేయాలి.

రూమీ - "ది ఎస్సెన్సియల్ రూమి" నుండి.

6.
ఒంటరిగా దుఖించే ఈ జనులు నన్ను
అలసిపోయేలా చేస్తున్నారు.
మత్తెంక్కించే నీ ప్రేమ మైకంలో తేలియాడాలని
యోధుని బలాన్ని నా చేతులతో తాకాలని నా ఆశ.

ఈ అశాశ్వత రాజులతో విసిగిపోయాను.
నీ కాంతిని చూడాలనుకొంటున్నాను.

ఈ షేకులు, ముల్లాలు దీపాలు చేతబూని
వారువెతికేది ఎంతకీ దొరకక
చీకటి సందుగొందులలో
తిరుగాడుతున్నారు.

నీవు తత్వ సారానివి. ప్రేమ మైకానివి.
నీ కీర్తనలు పాడాలనుకొంటాను.
కానీ, హృదయంలో బాధించే కోర్కెతో
మౌనంగా నిలుచుండిపోతాను.

రూమి -- ద లవ్ పోయమ్స్ ఆఫ్ రూమి నుండి.

7.
ఈ నూతన ప్రేమలో మరణించు.
ఆవలి వైపున నీ దారి మొదలవుతుంది.
ఆకాశంలా మారిపో.
చేత గొడ్డలిపూని కారాగార తలుపులను చేధించు.
పారిపో!
కొత్తగా జన్మించినవానిలా ముందుకు సాగు.
ఆ పని ఇప్పుడే చేయి.

నీవు దట్టమైన మేఘంతో కప్పబడ్డావు.
పక్కకు జరుగు. మరణించు.

మౌనంగా ఉండు.
నీవు మరణించావనటానికి మౌనమే ఋజువు.
నీ పాత జీవితమనేది
మౌనంనుండి చేసిన ఓ పిచ్చి పరుగు.

మౌన చందమామ ఇప్పుడు ఉదయించింది.

రూమీ - "ది ఎస్సెన్సియల్ రూమి" నుండి.

ఇన్ని వేల నేనుల్లో ఏ నేనును నేనా అని ఆశ్చర్యపోతూంటాను.
నా అరుపును విను. నా స్వరాన్ని ముంచి వేయకు.
నీ ఆలోచనలతోనే నిండిపోయాను నేను. నా దారిలో గాజుపెంకులను వెదజల్లకు.
నీ దయ, శోకం, కోపాలను ప్రతిబింబించే నీ చేతి దర్పణాన్ని కాక మరేమీ కాను.
నీ నీడలో నా గుడారాన్ని పాతుకొంటాను.
నీ ఉనికే నా వాడిన హృదయాన్ని వికసింపచేస్తుంది.
ఈ ప్రపంచాన్ని వెలిగించే దీపానివి నీవు. నీ కాంతిని నింపుకొనే ఖాళీ పాత్రను నేను.

రూమి – "హిడెన్ మ్యూజిక్" నుండి

ఖ్వాజా షామ్సుద్దీన్ మొహమ్మద్ హాఫీజ్ సిరాజి (1315-1390)

ఒక పర్షియన్ కవిగా హాఫీజ్ కు మంచి పేరు ఉంది. అది ఎంతంటే ఈతని పుస్తకాలు, ఖురాను కంటే ఎక్కువగా అమ్ముడు పోయేవట.
హాఫీజ్ కవిత్వంలో సౌందర్యం, మార్మికత, ప్రేమ, కరుణ వంటి విశ్వజనీన భావాలు పరిమళిస్తూంటాయి. నిశిత దృష్టి, ఆహ్లాదమైన శైలి, లయ, సరళ భాషతో ఉండే హాఫీజ్ కవిత్వం ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఆదరణ పొందింది. మరో పర్షియన్ కవి, అత్తర్ వద్ద హాఫీజ్ శిష్యరికం చేసాడు.

భారతదేశపు యోగి శ్రీమెహర్ బాబా , హాఫీజ్ గీతాలను పాడేవారట.

హాఫీజ్ " అశరీర వాణి" అనీ (Tongue of the Invisible), "కవులకే కవి" అని కీర్తి గడించాడు. దేవునిలో లీనమయ్యే మార్గాలను అన్వేషిస్తూ హాఫీజ్ ఎన్నో వందల గీతాలను రచించాడు. హాఫీజ్ సుమారు 5000 గీతాలు వ్రాసినట్లు ఒక అంచనా . హాఫీజ్ తన గీతాలలో ఎక్కడో ఒక చోట తన పేరును పొందుపరచుకొనే వాడు.

మతపెద్దల ధ్వంధ్వ ప్రవృత్తులను తన వ్రాత లలో విమర్శించినందుకు హాఫీజ్ తన చరమాంకంలో రాజదండనకు గురి అయ్యాడని అంటారు.

1.

నీ చేతులలో ఒక శిశువు

నా ప్రేమ కెరటం
ఎంతో ఎత్తుకు లేచింది
నిన్ను ఉప్పెనలా ముంచెత్తనీ.

కనులు మూసుకో
బహుసా నీ భయాలు, కల్పనలు
ముగియవచ్చేమో!

అదే కనక జరిగితే
ఈశ్వరుడే నీ చేతులలో
ఓ శిశువు అవుతాడు.

అపుడు
ఈ సృష్టినంతా నీవే
లాలించవలసి ఉంటుంది.

హాఫీజ్ -- 'సబ్జక్ట్ టునైట్ ఈజ్ లవ్' నుండి

2.
ఒకే ఒక నియమం

ఆకాశం
ఓ వేలాడదీయబడ్డ నీలి సంద్రం
నక్షత్రాలు ఈదులాడే చేపలు.
ఒక్కోసారి నేను స్పృశించే గ్రహాలేమో
తెల్లని తిమింగలాలు.

సూర్యుడు, కాంతి మొత్తమూ
నా హృదయంలో, నా దేహంతో
శాశ్వతంగా పెనవేసుకున్నాయి.

ఈ ఎడారి క్రీడాస్థలంలో
హాఫీజ్ కి ఒకే ఒక నియమం
ఇంతవరకూ కనిపించింది.

అదేమిటంటే
ఈశ్వరుని ఆటలో
ఆనందించు మిత్రమా ఆనందించు.
ప్రియవిభుని అద్భుతమైన ఆటలో
ఆనందించు.

హాఫీజ్ -- 'సబ్జక్ట్ టునైట్ ఈజ్ లవ్' నుండి

3.
సూర్యుడు ఏనాడూ అనలేదు

ఇంతకాలంగా
సూర్యుడు భూమితో
నీవు నాకు ఋణపడి ఉన్నావని
ఏనాడూ అనలేదు.

అటువంటి ప్రేమలో
ఏం జరుగుతున్నదో గమనించావా!
మొత్తం ఆకాశం అంతా వెలుగే
హాఫీజ్ - 'ది గిఫ్ట్ ' నుండి

4.
సూర్యుడు సౌందర్యపోటీలో నెగ్గి
ఈశ్వరుని చేతి రత్నమై నిలిచాడు.

భూమి తన విభుని కాలి కడియమై
ఉండటానికి అంగీకరించింది.
తన నిర్ణయానికి ఏనాడూ చింతించలేదు.

నిదురించే ప్రేక్షకుల మధ్య కూర్చొని కూర్చొని
పర్వతాలు విసిగిపోయాయి.
తమ చేతులను పైకప్పు వైపు సారిస్తున్నాయి.

మబ్బులు నా ఆత్మ కి ఓ సలహా ఇచ్చాయి.
వెంటనే నేను నా మధుపాత్రను తాకట్టు పెట్టి
రెక్కలు తొడుక్కొన్న వజ్రమై పైకి ఎగసాను.
నా ప్రయత్నమంతా ముంచెత్తే ప్రేమకు
దగ్గరగా ఉండటానికే -- నీలానే.

నాలోని నిదురించే జనాల మధ్య ఉండటం
పర్వతానికి విసుగనిపించిందేమో!
సూర్యునిలా నా కనులలోకి ఎగసింది.
నా ఆత్మ నా హృదయానికిచ్చిన గొప్ప సలహాతో
హాఫీజ్ రెక్కల వజ్రమై పైకి లేస్తున్నాడు.

హాఫీజ్ - 'ది గిఫ్ట్ ' నుండి

5.
రావోయి మిత్రమా!
గులాబీలను వెదజల్లి, గ్లాసులనిండా
ద్రాక్షమధువుని నింపుకుందాం.

స్వర్గలోకపు పై కప్పును ధ్వంసం చేసి
కొత్త పునాదులు నిర్మిద్దాం.

విషాదం తన సైన్యంతో దండెత్తి
ప్రేమికుల రక్తాన్ని చిందిస్తే
సాకితో చేయికలిపి, దానిని మట్టి కరిపిద్దాం.
మిత్రమా, చేత వాయిద్యముతో,
మధుగీతాన్ని పాడుతూ
ఆనంద నృత్యంలో సోలిపోదాం.

హాఫీజ్ ' పెర్షియన్ పోయమ్స్ ' నుండి

6.
నేను చాలా తెలుసుకొన్నాను

నేను ఈశ్వరుని ద్వారా
ఎంతో తెలుసుకొన్నాను.
ఇకపై నన్ను నేను
ఓ క్రిష్టియననో, హిందువుననో, ముస్లిముననో
బౌద్ధుడననో, యూదుడిననో
పిలిపించుకోను.

సత్యం తనని తాను
ఎంతగానో నాతో పంచుకొంది.

ఇకపై నన్ను నేను
ఓ పురుషునిగానో, స్త్రీగానో, దేవదూతగానో

లేదా ఒక స్వచ్ఛమైన ఆత్మగానో
అనుకోవటం లేదు.

హాఫీజ్ తో ప్రేమ ఎంతో స్నేహించి
తాను దహింపబడి,
నామనసు తెలుసుకొన్న
ప్రతిఒక్క ఆలోచన, స్వరూపాల నుండి
నన్ను విముక్తుడిని చేసింది

హాఫీజ్ - 'ది గిఫ్ట్ ' నుండి

7.
ఆతని సౌందర్యానికి మనం కావలిదారులం
తేజో మూర్తికి మనం రక్షకులం.

కారణమొకటే
మనం ఈశ్వరుని అనుసరిస్తూ
ఈ లోకంలోకి వచ్చాం.
ఆనందాన్ని, స్వేచ్ఛను, నాట్యాన్ని
ప్రేమను పెంపొందించటానికి. అంతే.

నీలో ఏదో ఓ ఉన్నత స్వరం
నాతో ఇలా మాట్లాడనీ!
"హాఫీజ్! ఈ వెన్నెల రాత్రి అలా ఖాళీగా కూర్చోకు
నా హృదయాన్ని మన విభుని
మనసులో విచ్చుకొనేలా చేయి.
గాయపడిన నా రెక్కలను స్వస్థపరచు."

మనమాతని సౌందర్యానికి సహచరులము.
సత్యానికి సంరక్షకులము.
ప్రతి పురుషుడు, మొక్క, క్రిమి
ప్రతి స్త్రీ, శిశువు, నరము , నాదము

మన ప్రియ విభుని సేవకులే.

అదిగో ఆనందము
అల్లదిగో వెలుతురు.

హాఫీజ్ -- 'సబ్జక్ట్ టునైట్ ఈజ్ లవ్' నుండి

హకిమ్ అబుల్ మజ్ద్ మజ్దూద్ ఇబ్న్ ఆదం సనాయ్ ఘజ్నావి (సనాయ్) 1080 (?) -1131

సనాయ్ రచనలు పర్షియన్ సాహిత్యానికి దిశానిర్దేశం చేసాయని పరిశీలకులు భావిస్తారు. వచన రూపంలో సూఫీతత్వాన్ని వెలువరించిన మొదటి కవి , సనాయ్. కోరికలు, ఉద్వేగాలు, అత్యాశ మానవుని దేవుని నుంచి దూరంచేస్తాయని సనాయ్ రచనలు ప్రవచిస్తాయి.
ఘాజ్నావిద్ కి రాజయిన బహ్రామ్ షా కొలువులో సనాయ్ ఆస్థాన కవి . బహ్రామ్ షా భారతదేశంపై దండెత్తటానికి బయలు దేరే సమయాన సనాయ్ రాజుగారి విజయాన్ని కాంక్షిస్తూ వ్రాసిన పద్యాలను చదవటానికి రాజ దర్బారుకు వెళుతున్నప్పుడు, లై ఖూర్ అనే ఓ సూఫీ " ఎందుకయ్యా ఈ అశాశ్వత రాజులను , రాణులను కీర్తిస్తూ నీ ప్రతిభను వృధా చేసుకొంటున్నావు ?" అని సనాయ్ కళ్లు తెరిపించి, ఈయనను భక్తి మార్గంలోకి మళ్లించాడని అంటారు.

ఆ తరువాత సనాయ్ రాజకొలువును, తన ఐశ్వర్యాన్ని త్యజించి, ఈశ్వరారాదనలో మునిగి, అనేక రచనలు చేసాడు. వాటిలో ఉత్కృష్టమైనదిగా The Walled Garden of Truth ను పేర్కొంటారు. మరో ప్రముఖ సూఫీ కవి రూమి ఒకచోట "అత్తర్ నాకు ఆత్మ , సనాయ్ నా రెండు నేత్రాలు " అని చెప్పుకొంటాడు. సనాయ్ రచనలను ఓషో ఎక్కువగా ఇష్టపడి తన ఉపన్యాసాలలో ఉటంకించేవారట. సనాయ్ తన జీవితకాలంలో మొత్తం ముప్పై వేల పద్యాలను రచించాడని ఒక అంచనా.

సనాయ్ గురించి మరింత సమాచారం కోసం ఈ క్రింది లింకులో చూడండి
http://en.wikipedia.org/wiki/Sanai

1.
మన కలయికను ఆటంకపరచే
కలలను తరిమేయటానికి నేనెంత
మనసారా యత్నిస్తానో!
నిన్ను తెలుసుకొనే అన్వేషణలో
నీవు నా అంచులవరకూ నిండిపోయావు.

ఈ అన్వేషణే నీకూ నాకూ మధ్య
అడ్డునిలుస్తుందేమోనని సంశయం గా ఉంది.

సనాయ్ -- వాల్డ్ గార్డెన్ ఆఫ్ ట్రూత్ నుండి.

2.
విశ్వాసం ద్వారా
నీకు దగ్గరగా చేరతాను.
కానీ గుమ్మం వరకు మాత్రమే.
నీ రహస్యంలోకి
ఇంకి పోవటం ద్వారానే
ప్రవేశం లభిస్తుంది.
సనాయ్ -- వాల్డ్ గార్డెన్ ఆఫ్ ట్రూత్ నుండి.

3.
నీ బాధలగురించి మాట్లాడకు
ఆయనకు తెలుసు
ఆయనగురించి అన్వేషించకు
ఆయనే నీకొరకు ఎదురుచూస్తున్నాడు.

చీమకాలు ఆకును తాకింది
ఆయన గమనించాడు.
సెలయేటి గర్భంలో గులకరాయి కదిలింది
ఆయన గుర్తించాడు.
రాతిలో దాక్కున చిన్ని పురుగు కూడా

ఆయనకు పరిచయమే.
దాని కీర్తనల ధ్వనులు, ఆనందరహస్యాలు
ఆయనకు విదితమే.
ఆ చిన్ని క్రిమికీ తిండినందిస్తున్నాడాయన
పవిత్రమార్గాలను నీకు తెరచినట్లుగానే!
సనాయ్ -- ది పజిల్

4.
ఎవరైతే శోకించలేరో
తమ ప్రేమను తెలుపుకోలేరో
విశ్వాసంగా ఉండలేరో లెక
అన్నింటికీ మూలం
ఈశ్వరుడేనని గుర్తుంచుకోరో,
వాళ్లు ఓ ఖాళీ గాలి
లేక చలిపెట్టే లోహ ముద్దలు
లేదా భయపడే వృద్ధుల గుంపు.

ఆయన నామాన్ని ఉచ్చరించు.
నీ నాలుకను కీర్తనలతో తడిచేసుకో.
నిదురలేస్తున్న పుష్పించే మన్నుగా మారు
అడవిగులాబీల స్వర్ణపుప్పొడిని
నీ పెదాలతో అందుకో.

జ్ఞానంతో నీవు
ప్రేమతో నీ హృదయం నిండినపుడు
ఇక దాహం వేయదు.

పధికుల సలహాలను పెడచెవినిపెడుతూ
దయగల తాళిమి నిశ్శబ్దంగా గుమ్మం వద్ద
ఎదురు చూస్తోంది- నీ కొరకై

సనాయ్ -- "పెర్షియన్ పోయమ్స్" నుండి

5.
బాధలనుంచి పారిపోయేవాడు
ప్రేమికుడు కాలేడు.
నేను మాత్రం అన్నింటినీ మించి
నీ ప్రేమనే కోరుకొంటాను.
సంపదలు రావొచ్చు, పోవొచ్చు
అది వేరే సంగతి.
ప్రేమ, సంపదలు వేర్వేరు లోకాల విషయాలు.

నీవు నాలో ఉన్నంత కాలమూ
నేను బాధపడుతున్నానని అనలేను.

సనాయ్ -- "పెర్షియన్ పోయమ్స్" నుండి

6.
తర్కం ద్వారా ఈశ్వరుని చేరాలనుకొంటాం
విఫలమయ్యామని తెలుసుకొన్న మరుక్షణం
అవరోధాలన్నీ తొలగిపోతాయి.
ఆయన మనపట్ల వాత్సల్యముతో
దర్శనమిస్తున్నాడు.
లేకపోతే మనం తెలుసుకోగలమా?
తర్కం గుమ్మంవరకూ తీసుకుపోతుంది
ఆయన దయే మనలను లోనికి అనుమతిస్తుంది.
******
ఒకటి ఎప్పటికీ ఒకటే
ఎక్కువా కాదు తక్కువా కాదు.
ద్వైతం తోనే పొరపాటు మొదలౌతుంది.
ఏకత్వానికి ఆ సమస్య రాదు.
******
నీ ఆత్మ ప్రయాణించాల్సిన మార్గం
హృదయాన్ని మెరుగుపెట్టుకోవటంలోనే ఉంది.

హృదయ అద్దాన్ని మెరుగు పెట్టుకోవటం అంటే
దానిపై చేరిన కపటత్వం, అవిశ్వాసం అనే మురికి పట్ల
కలత చెందటమో లెక దిక్కరించటమో కాదు,
ఈశ్వరునిపై నిశ్చయమైన పరిశుద్ధ నమ్మిక నుంచటమే.
****
నీ చుట్టూ నీవు సృష్టించుకొన్న శృంఖలాలను ఛేధించు.
మన్ను నుండి స్వేచ్ఛనొందితే నీవు విముక్తుడవైనట్లే.
ఈ దేహం చీకటి . హృదయం ప్రకాశిస్తూంటుంది.
దేహం ఉత్త పెంట. హృదయం పువ్వుల తోట.

సనాయ్ -- వాల్డ్ గార్డెన్ ఆఫ్ ట్రూత్ నుండి.

నూరుద్దీన్ దిన్ అబ్దర్ రహ్మాన్ జామీ (జామీ) 1414-1492)

జామీ పదిహేనవ శతాబ్దానికి చెందిన పెర్షియన్ సూఫీకవి . సూఫీ కవులలో చివరి తరానికి చెందిన తాత్వికుడు.
"నా స్వస్థానం జామ్ (ప్రస్తుతం ఆఫ్ఘనిస్తాన్ లో ఉంది). నా జ్ఞాన దాహాన్ని తీర్చిన గురువు పేరు అహ్మద్ జామీ . రెండూ కలిపితే నా కలంపేరు జామీ" అని తనను తాను పరిచయం చేసుకొంటాడు.

ఒకనాడు తనవద్ద శిష్యరికం చేయటానికి వచ్చిన విద్యార్థితో నీవు ఎవరినైనా ప్రేమించావా అని అడిగగా , "నేనెవరినీ ఇంతవరకూ ప్రేమించలేదు " అని అంటే , " వెళ్లు, ఈ ప్రపంచాన్ని ప్రేమించి రా , అపుడు నీకు మార్గాన్ని నే చూపిస్తాను " అని అన్నాట్ట జామీ.

జ్ఞానయానానికి ప్రేమే ప్రధమ సోపానం అని, విశ్వజనీన ప్రేమే ఈశ్వరునికి దగ్గరదారి అని జామీ భోదించేవాడు.

జామీ మొత్తం 87 పుస్తకాలు రచించాడు . వాటిలో బహారిస్తాన్ (Adobe of spring), హాఫ్త్ అవ్రాంగ్ (Seven Thrones) వంటివి ప్రముఖమైనవి . జామీ

కవిగానే కాక , ఖగోళ శాస్త్రం , సంగీతం, చిత్రలేఖనం, తర్కశాస్త్రము వంటి వివిధరంగాలలో ప్రావీణ్యతను కలిగిఉండి బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు తెచ్చుకొన్నాడు.

జామీ గురించి మరింత సమాచారం కోసం ఈ క్రింది లింకులో చూడండి
http://en.wikipedia.org/wiki/Jami

1.
నీవు పొందినవాటినన్నింటినీ
ఏదో ఒకనాడు మృత్యువో లేక జీవితమో
దొంగిలించుకుపోతుంది. ఆ లోపు
నిత్యం నీతోనే ఉండే ఆ సర్వాంతర్యామి వద్ద
నీ హృదయాన్ని దాచుకో.

--- జామీ

2.
ప్రభూ
నీవు నా హృదయాన్ని వేయిసార్లు
విరిచినా నాకేం భయంలేదు.
కానీ ఇక్కడ నేనిలా తయారయినందుకు
నన్ను ఏవగించుకొని విడిచిపెట్టకు
ఈ తోటలోని ప్రతీపూవు తమ వేర్లను
రొచ్చులోనే కలిగిఉన్నాయి.

---- జామీ

3.
మానవ మూలాల అన్వేషణ లేని వాడు
రూపాన్ని మాత్రమే పొంది,
మిగిలినదంతా పోగొట్టుకొన్నట్లు.
అన్నిబాధలను జీవితం స్పష్టపరుస్తుంది

కానీ బాధలేనితనానికి మందు లభించదు.
----జామి

4.
అనామకునిగా మారే రహస్యాన్ని
ఛేదించినవాడు అదృష్టవంతుడు.
ఎవరో ఒకనిగా ఉండటం ద్వారా సాధించేదేముంది!

నిష్కామము, అనాశక్తత తప్ప మిగిలినదంతా
భ్రమ లేదా భ్రమ ను చేరే దారి.
నీ మోముపై ప్రసరించే కాంతి
దైవ జ్వాల గురించి గుసగుసలాడుతుంది.
ఎవ్వరి నుంచి నువ్వూ నేను వచ్చామో
ఆ ఈశ్వరుడే దీనికి సాక్షి.

పంజరపక్షి పరిమళ పూదోటను చేరాలంటే
ఊహాలోకాలను దాటుకొంటూ వేళ్లాల్సిందే.
మానవ లలాట లిపి ఇంకా ఉన్నతమైనది
ఎందుకంటే నీ ఒప్పందం
సాటి మానవునితో కాదు ఈశ్వరునితో

ప్రియవిభుని రథాన్నధిరోహించే
అనుమతి నీకింకా లేకపోతే దాని
ఘలంఘలలు వింటూ తృప్తిపడు.

హృదయరాజ్యాన్ని పగటివేళ పాలించే రాజు
రాత్రి పూట దానికి జీవాన్నిచ్చే రజనీచరుడు
మరెవ్వరో కాదు మన ప్రభువే.
--- జామి

5.
నీ గమ్యం ఉన్నతమో లేక అవమానకరమో
ఏమైనా కానీ,
రాగ, విరాగాల నుంచి
నిన్ను నీవు శుద్ధిచేసుకో
నీ అద్దాన్ని స్వచ్ఛంగా ఉంచుకో.
యోగులకు, ప్రవక్తలకూ జరిగినట్లుగా
రహస్య లోకాల అద్భుత సౌందర్యం
నీ హృదయంలో ప్రకాశించనీ

ఆ సౌందర్యజ్వాలలో దహించబడే
నీ హృదయంలో నీ విభుని చిరునామా
ఇంక ఏమాత్రమూ దాగి ఉండలేదు.
---- జామీ

6.
మాయ అనే తెరవెనుక దాగిఉన్న సౌందర్యం అఖిలమైనది . ఈ లోకపు మట్టితో ఈశ్వరుడు అసం ఖ్యాక దర్పణాలను సృష్టించాడు . ప్రతీ దర్పణంలో తన ప్రతిబింబాన్ని ఉంచాడు . నీ కంటికి కనిపించిన సౌందర్యం అంతా ఆయన ప్రతిబింబమే. ఇపుడు నీవు ప్రతిబింబాన్ని మాత్రమే చూస్తున్నావు . దాని మూలమెక్కడుందో అన్వేషించు. మూలానికి దూరంగా సంచరించవద్దు , చీకటిలోకి జారిపోగలవు. ఈ ప్రతిబింబం రోజా దరహాసంలా క్షణ భంగురం . నీకు శాశ్వతత్వం కావాలా మూలాన్ని చేరుకోవాల్సిందే . యధార్థం తెలుసుకోవాలనిఉందా , అయితే విశ్వాసమనెడి గనిని తవ్వు . ఇలాగ వచ్చి అలాగ పోయే వాటికై ఎందుకు నీ ఆత్మను మలినం చేసుకొంటావు?

--- జామీ

ఓ సాకి
ఒక మధుపాత్రిక నిచ్చి నాపై దయచూపు.
నాలోకే నేను పూర్తిగా కూరుకుపోయాను
ఒక్కసారి నానుంచి నన్ను విడుదల చేయవూ!

నేనెవరి కంటా పడకూడదనుకొంటాను
ప్రేమ తాలూకు పొగమంచు కమ్ముకొన్న ఆ అద్భుత క్షణం లో నాకు నేనే
కనిపించకూడదనుకొంటాను.

ప్రభూ
నీకూ నాకూ మధ్య నేను తప్ప మరే తెరా లేదు
దయతో ఈ తెర తీయగ రావా.
జీవి జీవాన్ని ఎక్కడైతే పొందుతుందో
అట్టి శూన్యత్వాన్ని దర్శింపచేసే మహిమను
తెలియచేయవా, మిత్రమా

జామీ
ప్రేమ నీ అన్ని అనవాళ్లనూ చెరిపేసేవరకూ
నీలో ఉండే నిన్నుని పూర్తిగా కడిగివేసేవరకూ
ఆద్యంతరహితమైన జీవితం నీకు సుదూరమే.
ప్రేమ విస్తరించుకొని ఉండేది స్థల, ప్రాంతాలలో కాదు.
ఈ ప్రదేశాలు, దేశాల నుండి బయటకు
పడే దారిని అన్వేషించు.

---- జామీ

ఇతర సూఫీ కవులు

రబియా అల్ అదావియ్యా 717-801) ప్రముఖ సూఫీ కవయిత్రి. తలితండ్రులు చిన్నతనంలోనే చనిపోవటంతో, రబియా బానిసత్వంలోకి నెట్టబడింది.

చాలాకాలంపాటు తన యజమానికి ఊడిగం చేసిన తరువాత రబియా, తన ఆలోచనలను, చర్యలను ఈశ్వరునివైపుకు మళ్లించుకొని గొప్ప సూఫీ కవయిత్రిగా నిలిచి, అనేక రచనలు చేసారు

తన నిబద్దత, విశ్వాసాలకు చలించి, రబియాను బానిసత్వం నుంచి విముక్తురాలిని చేసాట్ట యజమాని.

1.
నేను నిన్ను రెండు విధాలలో ప్రేమిస్తూంటాను.
ఒకటి స్వార్ధ ప్రేమ. మరొకటి ఎంతో విలువైనది.
స్వార్ధ ప్రేమలో నేను నిన్నే స్మరిస్తూంటాను.
రెండవదానిలో
నీవు తెర తొలగిస్తావు. నీ సుందర మోమును
కన్నుల పండుగగా నేనలా చూస్తూ ఉండిపోతాను.
రబియా

2.
ప్రభూ!
నిను నా హృదయ వల్లభునిగా చేసికొన్నాను.
కానీ నా దేహం మాత్రం తనను కోరుకొనే వారికి అందుబాటులో ఉండి
తన అతిధితో స్నేహిస్తూంటుంది.
నా హృదయవల్లభుడే నా ఆత్మకు అతిధి.
రబియా

సాదాలుద్దీన్ మహ్మద్ షాబిస్తరి (1250-1320) ప్రముఖ సూఫీ కవి.

నీ హృదయమందిరాన్ని శుభ్రం చేయి.
నీ ప్రియవిభుని నివాసానికై దానిని సిద్ధంచేయి.
నీవు దానినుండి బయటకు వస్తే ఆయన లోపలకొస్తారు.
నిన్ను నీవు ఖాళీ చేసుకో. ఆయన తన సౌందర్యాన్ని చూపిస్తారు.

షిరాజ్ 1215-1292) పర్షియాకు చెందిన గొప్ప సూఫీ కవి. రోజ్ గార్డెన్, ఆర్చార్డ్ వంటి ప్రముఖ రచనలు చేసారు.

ఉదయవిహంగమా!
చిమ్మెటను చూసి ప్రేమించటం నేర్చుకో.
అది దహించుకుపోయింది. జీవితాన్ని కోల్పోయింది.
నిశ్శబ్దమైపోయింది.
ఈ వేషగాళ్లు ఆయనను అన్వేషిస్తున్నారు, అజ్ఞానులు.
జ్ఞానాన్ని పొందినవారెవరూ తిరిగి రాలేదు మరి.

